క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ సెక్షన్ 11 కేవీ గులాబీతోట ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గులాబీ తోట, గణపతి స్ట్రీట్, సాంబమూర్తి రోడ్డు, పున్నయ్య కాలనీ, సాయి ప్రసన్న స్ట్రీట్, సాయిబాబా స్ట్రీట్, కూనపు రెడ్డి వారి వీధి, మోహన్‌గాంధీ స్ట్రీట్, కాకర్లమూడి వారి స్ట్రీట్, గులాబీతోట రోడ్డు, బీఆర్టీఎస్ రోడ్డు, భానునగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

దాసాంజనేయునికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభు మాచవరం దాసాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి సింధూరం, ఆకుపూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ నాగినేని భవాని పర్యవేక్షించారు.

డొంకరోడ్డు ఇలా.. వెళ్లేదెలా!



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ దావు బుచ్చయ్యకాలనీ డొంక రోడ్డు సెకండ్ క్రాస్ రోడ్డులో వర్షం నీరు నిలిచిపోయింది. దీంతో రాకపోకలకు స్థానికులు అవస్థ పడుతున్నారు. వర్షం నీటితో పాటు సర్పాలు, క్రిమి కీటకాల సంచారం అధికంగా ఉండటంతో తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఖాళీస్థలాలు ఎక్కువగా ఉండటంతో వాటిలో కూడా నీరు నిలిచిపోయింది. అధికారులు స్పందించి కనీసం రాకపోకలకు వీలుగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సాయినాథుడికి వెండి వితరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో మంగళవారం బాబావారి వెండి సింహాసనానికి దాత జంపన శరాబందిరాజు, సీతారావమ్మ దంపతులు పావు కిలో వెండి అందజేశారు. ఈ సందర్భంగా దాత సీతారావమ్మ మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన దత్తసాయి బాబావారికి వెండి సింహాసనం నిమిత్తం పావుకిలో వెండిని అందజేస్తున్నట్లు తెలిపారు. మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు మాట్లాడుతూ భక్తులు, దాతల సహకారంతో తాము ఇక్కడ షిర్డీలో మాదిరిగా అన్ని పూజలు చేస్తున్నామన్నారు. అనంతరం దాతను బాబావారి శేషవస్త్రం, చిత్రపటంతో సత్కరించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన మహిళపై కేసు

పాయకాపురం(విజయవాడరూరల్): మున్సిపల్ కార్పొరేషన్లో కాంట్రాక్టు పద్ధతిపై స్వీపర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన మహిళపై వచ్చిన ఫిర్యాదుతో మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాయకాపురం రాధానగర్‌కు చెందిన వడ్డిపల్లి సామ్రాజ్యం అనే మహిళ పాతరాజీవ్‌నగర్ వడ్డెర కాలనీకి చెందిన ఉప్పల ధనమ్మ, 12 మందికి ఔట్ సోర్సింగ్ శానిటరీ స్వీపర్స్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పింది. ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.40 వేలు తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ 13 మందితో ఒక నెల స్వీపర్ పనులు చేయించి తొలగించారు. ఉద్యోగంపై గట్టిగా అడగ్గా సామ్రాజ్యం రూ.1.40 లక్షలు తిరిగి ఇచ్చింది. ఇంకా రూ.3.80 లక్షలు తిరిగి ఇవ్వకుండా, స్వీపర్ ఉద్యోగాలు ఏర్పాటు చేయకుండా మోసం చేసినట్లు వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్ట్స్, క్రాఫ్ట్స్ విద్యకు ప్రోత్సాహంపై హర్షం

ఇబ్రహీంపట్నం: నూతన విద్యా విధానంలో భాగంగా ఆర్ట్స్, క్రాఫ్ట్స్ విద్యను ప్రభుత్వం ప్రోత్సహించడంపై ఏపీ ఆర్ట్స్ క్రాఫ్ట్స్, పీఈటీ ఇన్‌స్ట్రక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు నిశ్శంకర గాయత్రి హర్షం వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ యూనిటీ రాష్ట్ర అధ్యక్షురాలు సైకం శివకుమారి కృషి ఫలితంగా ఆర్ట్స్, క్రాఫ్ట్స్ విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. హస్తకళల విద్యతో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం, నైపుణ్యం పెరుగుతుందన్నారు. విద్యా శాఖ మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కలవరం.. కలుషిత జలం

- మంచినీటి కుళాయిల నుంచి దుర్వాసనతో కూడిన మురుగునీరు
- సింగ్‌నగర్, ఇందిరానాయక్‌నగర్, నందమూరినగర్ ప్రాంతాల్లో ప్రజల ఆందోళన

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మంచినీటి కుళాయిల నుంచి దుర్వాసనతో కూడిన కలుషిత నీరు వస్తుండటంతో సింగ్‌నగర్, ఇందిరానాయక్‌నగర్, నందమూరినగర్ పరిసర ప్రాంత ప్రజలు కలవరపడుతున్నారు. రెండు వారాల పైనుంచి ఇదే విధంగా నీళ్లు వస్తున్నాయని.. నగరపాలక సంస్థ సరఫరా చేసే నీరు సరిగ్గా లేకపోవడంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మురుగు కంపు

ఈ ప్రాంతాలకు వచ్చే తాగునీరంతా డ్రెయినేజీ కంపు కొడుతోంది. ముఖ్యంగా ఇందిరానాయక్‌నగర్ ప్రాంతంలో 20 రోజుల నుంచి ఇదే దుస్థితి నెలకొంది. తాగునీటి సరఫరా పైపులైన్లలో ఎక్కడో డ్రెయినేజీ లైన్ కలిసి ఉంటుందని, పంపుల నుంచి వస్తున్న నీరంతా మురుగు కంపు వస్తోందని స్థానికులు చెబుతున్నారు. సమస్యను పలుమార్లు సంబంధిత అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లామని ఎవరూ పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు.



ఇందిరానాయక్‌నగర్‌లో కుళాయిల నుంచి వస్తున్న మురుగునీరు

నెల రోజుల నుంచి అవస్థలు



గత నెల రోజుల నుంచి మంచినీళ్ల కోసం అవస్థలు పడుతున్నాం. వచ్చిన నీరంతా ఎర్రగా మురికి నీరులా ఉంటోంది. తాగలేకపోతున్నాం. ఈ నీళ్లు తాగి రోగాలు కొనితెచ్చుకోవడం కన్నా బోరింగ్ నీరు ఉత్తమం అని వాటినే వాడుకుంటున్నాం. సిబ్బందికి చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– మేరీ, ఇందిరానాయక్‌నగర్

తీవ్ర దుర్వాసన



మంచినీటి కుళాయిల్లో వస్తున్న నీరంతా తీవ్ర దుర్వాసన వస్తోంది. ఎంత వడకట్టినా.. వేడిచేసినా దుర్వాసన పోవడం లేదు. నెల రోజుల నుంచి ఇలానే వస్తున్నాయి. వేరే దారి లేక తాగడానికి మంచినీళ్లు కొనుక్కోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు సమస్యను గుర్తించి చర్యలు తీసుకోవాలి.

–షైనీ, ఇందిరానాయక్‌నగర్

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

ఎర్రకట్టమీద వాటర్‌లైను సమస్య పరిష్కారానికి నాలుగు రోజులుగా మరమ్మతులు చేస్తున్నాం. మంగళవారమే నీళ్లు వదిలాం. మురుగునీటి సమస్య దాదాపు పరిష్కారమైంది. ఇందిరానాయక్‌నగర్‌లో నీటిని పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– అరుణ్‌కుమార్, సింగ్‌నగర్ వాటర్ సప్లై ఏఈ

ఆ మలుపు ప్రమాదకరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్‌లోని మెయిన్‌రోడ్డులో మలుపు ప్రమాదకరంగా మారింది. ఇక్కడ మురుగు కాల్వ వద్ద అరకొరగా పనులు చేయడంతో ప్రజలు అవస్థ పడుతున్నారు. ఇక్కడ ఆర్‌యూబీ పనుల్లో భాగంగా ఓపెన్ డ్రెయిన్ నిర్మాణ పనులు చేపట్టారు. రోడ్డును తవ్వి మురుగు కాల్వ పనులను పూర్తి చేశారు. అక్కడ తవ్విన గోతులను సరి చేయలేదు. దీంతో రాకపోకలు సాగించే క్రమంలో తరచూ గాయాలబారిన పడుతున్నారు. మధురానగర్ మెయిన్ రోడ్డు నుంచి పసుపుతోట వెళ్లే మలుపులో కల్వర్ట వద్ద అసంపూర్తి పనులతో వాహన చోదకులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ ఇటీవల వర్షాలకు గుంతగా ఏర్పడి ప్రమాదకరంగా మారింది. అలాగే మధురానగర్ మెయిన్ రోడ్డు స్టేట్ బ్యాంక్‌వద్ద కూడా మురుగు కాల్వ వద్ద రోడ్డును సరిచేయకపోవటంతో బ్యాంక్‌కు వచ్చిన వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ మురుగుకాలువ పనులు సత్వరమే పూర్తిచేయడంతో పాటు రాకపోకలకు వీలుగా సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.



మధురానగర్ మెయిన్ రోడ్డు పసుపుతోట మలుపులో పూర్తికాని పనులు

యువకుడి ఆత్మహత్య

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న పోలీసుస్టేషన్ పరిధి కండ్రికకు చెందిన షేక్ బాజీ (23)అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై వచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. బాజీ పెయింటర్. అతను బంధువుల అమ్మాయిని పెళ్లి చేసుకునే విషయంలో తల్లి వద్దని చెప్పింది. దీంతో తరచూ మద్యం సేవిస్తున్నాడు. సోమవారం రాత్రి మృతుని అన్న ఫరీద్ పుట్టిన రోజున మద్యం సేవించి ఇంట్లో బాత్‌రూమ్‌లోకి వెళ్లి ఇనుపరాడ్‌కు కర్టెన్‌తో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి, బంధువులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. తల్లి షేక్ జైతున్నీసా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెత్త కుప్పల తొలగింపు



పాయకాపురం(విజయవాడరూరల్): విలేజి కండ్రికలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పేరుకు పోయిన చెత్త కుప్పలను కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపిరాజు మంగళవారం జేసీబీ మిషన్‌తో తొలగించారు. అనంతరం శివాలయం వద్ద శుభ్రం చేయించారు. రాధానగర్‌లో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వర్షం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలియజేశారు.

పారిశ్రామిక రంగానికి కేంద్రం పెద్ద పీట

ఆటోనగర్(విజయవాడతూర్పు): కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేసిందని, పరిశ్రమల బలోపేతానికి అనుకూలంగా ఉందని ఏపీ ఎంఎస్ఎంఈ గౌరవ అధ్యక్షుడు బాయన వెంకట్రావు అన్నారు. ఆటోనగర్‌లోని ఎంఎస్ఎంఈ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రొజెక్టర్ ద్వారా కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ బడ్జెట్ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీఎంఎస్ఈ అధ్యక్షుడు దుర్గాప్రసాద్‌తో పాటు పలువురు మాట్లాడుతూ ఏపీలో పరిశ్రమల ఏర్పాటు కు తోడ్పాటుకు కేంద్రప్రభుత్వం కృషి చేయనున్నట్లు చెప్పారు.

ముద్ర రుణాలు రూ.10 నుంచి 20 లక్షలకు పెంచుతున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి పేర్కొనడం హర్షనీయమన్నారు. కొత్తగా 12 పారిశ్రామిక కారిడార్లు, కార్మికులకు డార్మెటరి తరహా అద్దె ఇళ్ల నిర్మాణాలు చేస్తామని చెప్పడం మంచి పరిణామమన్నారు. మౌలిక వసతులకు రూ.11.11 లక్షల కోట్లు ఇవ్వడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎంఎస్ రామచంద్రారావు, కార్యదర్శి జమ్ముల ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్ఎంఈ గౌరవ అధ్యక్షుడు బాయన వెంకట్రావు

పాతబస్తీలో పార్కింగ్ దందా!

- టెండర్లు లేవు, అనుమతి లేదు
- అధికార పార్టీల నేతల అడ్డగోలు దోపిడీ
- స్థానిక ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ అండతో దందా!

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలో అధికార పార్టీకి చెందిన నేతలు పార్కింగ్ దందాలకు పాల్పడుతున్నారు. అధికారం చేపట్టి ఎక్కువ రోజులు గడవక ముందే అడ్డగోలుగా దోపిడీకి పాల్పడుతున్నారు. పార్టీలు వేరైనా ఎన్నికల్లో కలిసి కట్టుగా పని చేసిన నేతలు దోపిడీలోనూ కలిసే వాటాలు పంచుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక ఎమ్మెల్యేకు చెందిన పార్టీ నేతలతో పాటుగా స్థానిక టీడీపీ నేతలు పాతబస్తీలోని పార్కింగ్‌లపై కన్నేశారు. వారికి వీఎంసీ అధికారుల చేయూత తోడవ్వటంతో వారి దోపిడీ మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది.

రెండు పార్కింగ్‌లపై ఆక్రమణ

పాతబస్తీలోని రెండు ప్రధానమైన పార్కింగ్ ప్రాంతాలను టీడీపీ, బీజేపీ నేతలు ఆక్రమించారు. తాము ఎమ్మెల్యే తాలుకా, మాజీ ఎమ్మెల్సీ కుటుంబ సభ్యుల తాలుకా అని పార్కింగ్‌లను ఆక్రమించారని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. పాతబస్తీ కెనాల్‌రోడ్డులో వినాయకునిగుడి నుంచి రథం సెంటర్ బొడ్డు బొమ్మ వరకూ వీఎంసీ పార్కింగ్‌కు టెండర్లు పిలిచింది. అది జూన్ 26వ తేదీన ముగిసింది. మరుసటి రోజు నుంచి నగరపాలక సంస్థ సిబ్బంది పార్కింగ్ నిర్వహణ చేశారు. దానిపై కన్నేసిన అధికార పార్టీ నేతలు వీఎంసీ సిబ్బందిని అక్కడి నుంచి తరిమేసి వారే వసూళ్లకు దిగారు. అక్కడ దుర్గగుడికి చెందిన కాంట్రాక్టర్ వసూళ్లకు పాల్పడుతున్నారు. అధికార పార్టీకి చెందిన నేతల వత్తాసుతో వసూళ్లను కొనసాగిస్తున్నారని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. గడువు ముగిసినా వీఎంసీ ఎటువంటి టెండర్లు పిలవలేదు. కనీసం ఎవరికీ అనుమతి సైతం ఇవ్వలేదు.

ఇరిగేషన్ స్థలంలోనూ అదే దోపిడీ

నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం సమీపంలో సీతమ్మవారి పాదాల వద్ద ఇరిగేషన్ విభాగానికి చెందిన స్థలం ఉంది. దానిలో దసరా, భవానీ దీక్షల విరమణ ఉత్సవాల్లో దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తుల కోసం సదుపాయాలను ఏర్పాటు చేస్తుంటారు. దీని నిర్వహణ వీఎంసీ సిబ్బంది చూస్తుంటారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్థానిక టీడీపీ, బీజేపీ నేతల ప్రోత్సాహంతో కొన్ని రోజుల నుంచి ఇక్కడ కూడా అక్రమంగా పార్కింగ్ రుసుం వసూళ్లకు దిగారు. దీనికి సైతం టెండర్లు పిలవలేదు.



రథం సెంటర్ వద్ద పార్కింగ్ ప్రాంతం



అక్రమంగా వసూళ్లు చేస్తున్న దృశ్యం

కోర్టులో ఉన్నా తగ్గని నేతలు

వినాయకుని గుడి నుంచి రథం సెంటర్ వరకూ ఉన్న పార్కింగ్‌కు సంబంధించి ఒకరు కోర్టుకు ఎక్కారు. జూన్ వరకూ ఉన్న కాంట్రాక్టర్ చెల్లించిన దానికన్నా తాను అధికంగా ఇస్తానని కోర్టులో కేసు వేశారు. దానిపై విచారణ కొనసాగుతోంది. అంతలోనే కూటమికి చెందిన నేతలు ఇలాంటి దోపిడీకి పాల్పడుతున్నారు.

టీడీపీ నేతల కుట్రలు

వీఎంసీ, ఇరిగేషన్ శాఖల ఆధ్వర్యంలో ఉన్న పార్కింగ్‌లను దుర్గగుడి కిందకు తీసుకొచ్చి వాటిని తమ పరిధిలోకి తీసుకోవాలని స్థానిక కూటమి నేతలు కుట్రలు చేస్తున్నారని నగరపాలక సంస్థకు చెందిన ఒక అధికారి వ్యాఖ్యానించారు. అంతేకాకుండా వీఎంసీ సిబ్బందిని సైతం బెదిరించి పార్కింగ్ ప్రదేశాన్ని తీసుకున్నారని వారు చెబుతున్నారు. అందులో భాగంగానే ఎటువంటి టెండర్లు లేకుండా ఇలాంటి దందాకు పాల్పడుతున్నారని తెలిసింది. దీనిపై కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ దృష్టి సారించి నగరపాలకసంస్థకు వచ్చే ఆదాయాన్ని కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అసెంబ్లీకి ఎస్ఆర్ఆర్ కళాశాల విద్యార్థులు



అసెంబ్లీ వద్ద కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి మంగళవారం వందమంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అమరావతిలో అసెంబ్లీ సమావేశాలను వీక్షించడానికి వెళ్లారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి తెలిపారు. ఆమె మంగళవారం వివరాలు వెల్లడించారు. తమ కళాశాల విద్యార్థులకు అసెంబ్లీ సమావేశాలను వీక్షించడానికి అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు, విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. పుస్తకాల్లో థియరీ చదవడం వరకే కాకుండా ప్రాక్టికల్‌గా సమావేశాలు ఎలా జరుగుతాయో ప్రత్యక్షంగా విద్యార్థులు వీక్షించారన్నారు. ఇలాంటి అవకాశాన్ని కల్పించిన కళాశాల కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఎన్టీఆర్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ యుగంధర్, మహిళా సాధికారిత సెల్ కన్వీనర్ డాక్టర్ కె.అరుణ, సిబ్బంది ప్రశాంతి, ఉమామహేశ్వరి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నగరంలో ‘అలనాటి రామచంద్రుడు’ సందడి

లబ్బీపేట(విజయవాడతూర్పు): అద్భుతమైన ప్రేమ కావ్యం అలనాటి రామచంద్రుడు చిత్రాన్ని ఆగస్టు 2న ప్రేక్షకుల ముందుకు తీసుకురాన్నామని, ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులు వీక్షించి ఆదరించాలని చిత్ర కథానాయకుడు కృష్ణవంశీ కోరారు. ఎంజీరోడ్డులోని ఒక హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగులో తాను అలనాటి రామచంద్రుడు చిత్రంతో హీరోగా పరిచయం అవుతున్నట్లు తెలిపారు. దర్శకుడు ఆకాష్ చిత్రాన్ని ఒక అద్భుతమైన ప్రేమ కావ్యంగా మలిచారని తెలిపారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రముఖ నిర్మాత దిల్ రాజ్ తమ చిత్రాన్ని రిలీజ్ చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. హీరోయిన్ మోక్ష మాట్లాడుతూ సీత ప్రేమను దక్కించుకునేందుకు రాముడు పడిన కష్టాలను అలనాటి రామచంద్రుడు చిత్రంలో దర్శకుడు ప్రేక్షకులకు సరికొత్త రీతిలో చూపించనున్నారని పేర్కొన్నారు. దర్శకుడు ఆకాష్ మాట్లాడుతూ అందమైన లొకేషన్లలో గ్రామీణ వాతావరణంలో తీసిన సన్నివేశాలు ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతాయని చెప్పారు. సమావేశంలో నటులు దివ్యశ్రీ, స్నేహ పాల్గొన్నారు.



అలనాటి రామచంద్రుడు చిత్ర యూనిట్

వాహన్ పోర్టల్ ఇబ్బందులు పరిష్కరించండి

లబ్బీపేట(విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్ సేవల కోసం తీసుకొచ్చిన వాహన్ పోర్టల్ వల్ల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించాలని కేంద్ర రవాణాశాఖా మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ పంపినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పోర్టల్ ఈ–ప్రగతి స్థానంలో వాహన్ పోర్టల్ ఈ నెల 8 నుంచి ప్రయోగాత్మకంగా ఎన్టీఆర్ జిల్లాలో అమలు చేసే క్రమంలో వాహనదారుల డేటా కేంద్ర పోర్టల్ వాహన్ లోకి బదలాయింపు కావడం లేదన్నారు. వాహన్ పోర్టల్‌లో అన్ని రాష్ట్రాల వాహనాల డేటా ఇంకా అప్‌లోడ్ కాలేదని, కొన్ని రాష్ట్రాలు పొరుగు రాష్ట్ర వాహనాల నంబరు ప్లేట్లపై డిజిటల్ చలాన్‌లు జారీ చేస్తున్నాయని తెలిపారు. ఆ వివరాలు ఆయా రాష్ట్రాల వెబ్‌సైట్‌లలో మాత్రమే అందుబాటులో ఉంటున్నట్లు చెప్పారు. దీంతో వాహన యజమానులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని రాష్ట్రాల వాహనాల డేటా వాహన్ పోర్టల్ నూరుశాతం అప్‌లోడ్ చేసే వరకూ డిజిటల్ చలానాలు విధించకుండా కేంద్రం అన్ని రాష్ట్రాలకు వెంటనే సర్క్యులర్ జారీ చేయాలని ఆ లేఖలో కేంద్ర మంత్రిని కోరారు.



వైవీ ఈశ్వరరావు, లారీ ఓనర్స్ సంఘ రాష్ట్ర కార్యదర్శి

అటకెక్కిన పారిశుద్ధ్యం

రామవరప్పాడు: నగరానికి అతి సమీపంలో ఉన్న మేజర్ పంచాయతీ రామవరప్పాడులో పారిశుద్ధ్య సమస్య పట్టి పీడిస్తోంది. గ్రామంలో సుమారు 50 వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న ఈ గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ లోపంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించడానికి సుమారు 90 మంది పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు. వీరిని గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించే కంటే పంచాయతీ పెద్దలు వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామంలో ప్రధాన రహదారితో పాటు అంతర్గత రహదారుల్లో నిత్యం చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా రాజుల బజారు, బల్లెంవారి వీధి, కొట్టివారి వీధి, అంకిత అపార్టుమెంట్ ఏరియా, కాల్వగట్టు ప్రాంతాల్లో రహదారుల వెంబడే చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. ఫలితంగా ఆయా ప్రాంతాల్లోని వాసులకు నిత్యం అవస్థలు తప్పడం లేదు. పారిశుద్ధ్య నిర్వహణ కూడా అభివృద్ధి చెందిన ప్రాంతాల వరకే పరిమితం చేస్తున్నారే తప్ప లోపలి ప్రాంతాల్లో పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. గ్రామంలోని చెత్తనంతటినీ తీసుకొచ్చి బల్లెంవారి వీధిలోని ఎస్సీ శ్మశానంలో డంప్ చేస్తుండటంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ శ్మశానం ప్రధాన రహదారికి ఆనుకుని ఉండటం, దీని పరిసర ప్రాంతాల్లో నివాసాలు ఉండటంతో ఈ ప్రాంతవాసులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. శ్మశానం చుట్టూ చెత్త గుట్టలుగా పేరుకుపోయాయి. ఫలితంగా పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమలు వృద్ధి చెందుతున్నాయని సమీప ప్రాంతప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త డంప్‌తో శ్మశానంలోకి వెళ్లేందుకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది.సంబంధిత అధికారులు స్పందించాలి.

ఆదర్శప్రాయులు తిలక్, ఆజాద్

మైలవరం: స్వాతంత్య్ర సమరయోధులు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌లను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వాతంత్య్ర సమరయోధులు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో వీరిరువురూ ప్రముఖ పాత్ర పోషించారని చెప్పారు. చరిత్ర విభాగం అధ్యాపకులు దారావతు శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలగంగాధర్ తిలక్ నిర్వహించిన హోమ్ రూల్ ఉద్యమం ప్రముఖమైందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పురంశెట్టి రంగారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

27న మెగా జాబ్ మేళా

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 27న మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏపీఎస్ఎస్‌డీసీ సహకారంతో కళాశాల పూర్వ విద్యార్థులతో కలిసి నిర్వహించనున్న ఈ జాబ్ మేళాలో 17 ప్రముఖ కంపెనీలు పాల్గొని సుమారు రెండు వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని చెప్పారు. కళాశాల ట్రెయినింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. వెంకటాద్రి, ఏపీఎస్ ఎస్‌డీసీ ఎన్టీఆర్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ పి. నరేష్‌కుమార్ మాట్లాడుతూ ఎస్ఎస్‌సీ, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్, పీజీ విద్యార్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఇతర వివరాలకు సెల్: 6305004318 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ఇబ్రహీంపట్నం: సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఉమాదేవి అన్నారు. ఎంపీపీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై మంగళవారం అవగాహన కల్పించారు. విపత్తుల నిర్వహణపై పట్టు సాధించాలని ఆమె సూచించారు. దోమల నివారణ చర్యలతో వ్యాధులను నియంత్రించవచ్చన్నారు.